

# సినిమా న్యూస్

## రిలేషన్‌పై హింట్?



టాలీవుడ్‌లో మోస్ట్ టాలెంటెడ్ డైరెక్టర్ కమ్ యాక్టర్ తరుణ్ భాస్కర్, గ్లామరస్ బ్యూటీ ఈషా రెబ్బా రిలేషన్‌షిప్‌లో ఉన్నారంటూ గత కొంతకాలంగా సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వార్తలు హల్ చల్ చేస్తున్నాయి. 'ఓం శాంతి శాంతి శాంతి' సినిమాలో తొలిసారిగా వీరు కలిసి నటించారు. అయితే అప్పటి నుంచి వీరిద్దరూ ఎక్కడికి వెళ్లినా కలిసి కనిపించడం, పలు ఈవెంట్లు, వెకేషన్స్‌కు కలిసి వెళ్తూ మీడియాకు చిక్కుతుండటంతో వీరి డేటింగ్ రూమర్స్ నెట్టింట హాట్ టాపిక్‌గా మారుతున్నాయి. ఈ వార్తలపై గతంలో స్పందించిన తరుణ్ భాస్కర్, ఈషా రెబ్బా తాము కేవలం మంచి స్నేహితులమని క్లారిటీ ఇచ్చినప్పటికీ, సోషల్ మీడియాలో మాత్రం వీరికి సంబంధించిన పుకార్లు ఎప్పుడూ ఆగడం లేదు. తాజాగా ఈ రూమర్స్‌కు మరింత బలం చేకూర్చేలా మరో ఆసక్తికరమైన సంఘటన చోటుచేసుకుంది.

ఈ ఇద్దరూ కలిసి వినాయక చవితి వేడుకలను అత్యంత ఆనందంగా జరుపుకున్నారు. పండగ రోజున కలిసి పూజ చేస్తున్న ఒక ప్రత్యేకమైన ఫొటోను తరుణ్ భాస్కర్ తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేశారు. ఈ ఫొటో ఒక్కసారిగా టాలీవుడ్ చర్చకు దారితీసింది. ఈ పోస్ట్‌పై ప్రముఖ నటి మంచు లక్ష్మితో పాటు పలువురు సెలబ్రిటీలు, నెటిజన్లు స్పందిస్తూ తమ సంతోషాన్ని, తెలియజేస్తున్నారు. తరుణ్ భాస్కర్ షేర్ చేసిన ఈ ఫొటో చూసిన నెటిజన్లు రకరకాలుగా కామెంట్లు పెడుతున్నారు. ఈ ఫొటో ద్వారా వీరిద్దరూ తమ రిలేషన్‌షిప్‌పై పరోక్షంగా హింట్ ఇచ్చేశారని, త్వరలోనే అఫిషియల్‌గా పెళ్లి తేదీని కూడా అనౌన్స్ చేస్తారంటూ జోరుగా చర్చించుకుంటున్నారు. ఎప్పుడూ తన సినిమాలతో, వైవిధ్యమైన పాత్రలతో ప్రేక్షకులను అలరించే తరుణ్ భాస్కర్, వ్యక్తిగత జీవితానికి సంబంధించి త్వరలోనే ఎలాంటి గుడ్ న్యూస్ చెబుతారో అని ఆయన అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## సంక్రాంతి రేసులోకి శ్రీవిష్ణు




టాలీవుడ్‌లో క్యూట్ అండ్ నేచురల్ యాక్టింగ్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న హీరో శ్రీవిష్ణు, సెన్సేషనల్ డైరెక్టర్ రామ్ అబ్బరాజు కాంబినేషన్ మరోసారి రిపీట్ కాబోతోంది. వీరిద్దరి కలయికలో గతంలో వచ్చిన 'సామజవరగమన' సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సెన్సేషన్ సృష్టించిందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. బాక్సాఫీస్‌ను షేక్ చేసిన ఆ బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత ఈ క్రేజీ కాంబో వస్తుండటంతో ప్రేక్షకుల్లో, ఈ కొత్త సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నిర్మాతలు నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ సినిమా నుంచి తాజాగా, వినాయక చవితి సందర్భంగా అదిరిపోయే అప్డేట్ వచ్చింది. ఈ చిత్రానికి 'ఫ్యామిలీ ప్యాక్' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను మేకర్స్ ఖరారు చేశారు.

విడుదల చేసిన ఫస్ట్ లుక్ మోషన్ పోస్టర్ సినిమాపై క్యూరియాసిటీని విపరీతంగా పెంచేస్తోంది. ఒక భవనం పైనుంచి కరెన్సీ నోట్ల వర్షం కురుస్తుండగా.. కింద పడుతూ ఆ నోట్లను పట్టుకోవడానికి హీరో శ్రీవిష్ణు పడుతున్న పాట్లు చూస్తే నవ్వు ఆపుకోవడం కష్టమే. ఫస్ట్ లుక్ పోస్టర్‌లోనే ఇంత హిలేరియస్ కంటెంట్ ఉందంటే, సినిమా ఏ స్థాయిలో నవ్విస్తుందో అర్థం చేసుకోవచ్చు. పూర్తి స్థాయి కామెడీ, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త వినోదాన్ని పంచడం ఖాయంగా కనిపిస్తోంది. శ్రీవిష్ణు బాడీ లాంగ్వేజ్, రామ్ అబ్బరాజు కామెడీ టేకింగ్ ఈ సినిమాకు ప్రధాన బలంగా మారనున్నాయి. ఈ చిత్రాన్ని సంక్రాంతి 2027 కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. పండగ సీజన్‌లో ఫ్యామిలీ ఆడియన్స్‌ను కడుపుబ్బా నవ్వించడానికి శ్రీవిష్ణు గట్టిగానే సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

## 'ఈ క్షణం జీవితాంతం గుర్తుంటుంది'!

టాలీవుడ్ హీరో మంచు మనోజ్ తన సెకండ్ ఇన్నింగ్స్‌లో అద్భుతమైన విజయాలతో దూసుకుపోతున్నారు. ఒకవైపు విలన్ పాత్రలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటూనే, మరోవైపు వైవిధ్యమైన కథలతో కెరీర్‌ను విజయవంతంగా ముందుకు నడిపిస్తున్నారు. గత ఏడాది ఆయన నటించిన 'మిరాయ్' సినిమా బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచింది. ఈ చిత్రంలోని అద్భుతమైన నటనకు గాను తాజాగా, జరిగిన సైమా అవార్డ్స్ వేడుకలో మంచు మనోజ్‌కు ఉత్తమ విలన్ పురస్కారం దక్కింది. ఈ విజయంపై మంచు మనోజ్ సోషల్ మీడియా వేదికగా ఒక ఎమోషనల్ పోస్ట్ షేర్ చేశారు. తన జీవితంలో ఎదురైన కష్టకాలం, కుటుంబం అందించిన మద్దతును ఆయన గుర్తు చేసుకున్నారు. తాను భవిష్యత్తును సరిగ్గా ఊహించుకోలేక ఇబ్బంది పడుతున్న సమయంలో భార్య మౌనిక తన జీవితంలోకి వచ్చిందని తెలిపారు. తనను ఎంతగానో నమ్మిన మౌనిక తోడును ప్రశంసించారు.

'మిరాయ్' సినిమా షూటింగ్ సమయంలోనే తన కూతురు దేవసేన కడుపులో ఉందని, నేడు ఈ వేడుకలో భార్య పిల్లలు ముందర కూర్చుని తాను అవార్డు తీసుకోవడం చూసిన క్షణాన్ని జీవితాంతం గుర్తుంచుకుంటానని ఎమోషనల్ అయ్యారు. అలాగే తన తల్లిదండ్రుల నుంచి తనకు సినిమా పట్ల ప్రేమ, విలువలు వచ్చాయని, ప్రతిదీ వారి నుంచే మొదలైందని మనోజ్ పేర్కొన్నారు. కెరీర్ ప్రారంభం కాకముందే తనను సొంత తల్లిలా నమ్మిన తన అక్క మంచు లక్ష్మికి ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. తన ప్రతి విజయం వెనుక నిలబడి, తనకోసం ప్రార్థించిన ప్రతి ఒక్క అభిమానికి ఈ అవార్డును అంకితం చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా భార్యతో కలిసి దిగిన ఒక అందమైన సెల్ఫీని ఆయన పంచుకున్నారు. కాగా, బెంగళూరు వేదికగా అత్యంత వైభవంగా జరిగిన 2026 సైమా అవార్డ్స్ వేడుకలో తెలుగు, తమిళ, కన్నడ సినీ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొని అవార్డులు అందుకున్నారు.



## మహాశక్తి వచ్చేసింది

లేడీ సూపర్ స్టార్ నయనతార ప్రధాన పాత్రలో నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ ఫాంటసీ ఎంటర్‌టైనర్ చిత్రం 'మూకుత్తి అమ్మన్-2'. సీనియర్ దర్శకుడు సుందర్ సి అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న ఈ క్రేజీ ప్రాజెక్ట్‌లో నయనతార మరొకసారి పవర్‌ఫుల్ దేవత పాత్రలో కనిపించి తన అద్భుత నటనతో ప్రేక్షకులను మెప్పించబోతున్నారు. ఈ మూవీ 'మూకుత్తి అమ్మన్' చిత్రానికి సీక్వెల్‌గా రాబోతుంది. ఈ ప్రతిష్టాత్మక సినిమాను అవ్ని సినిమాస్, వెల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కంపెనీ, ఐవీ ఎంటర్‌టైన్‌మెంట్స్, రౌడీ పిక్చర్స్ బ్యానర్లపై నిర్మాత ఇషారి గణేష్ ఎంతో భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. తాజాగా, నేడు గణేష్ చతుర్థి సందర్భంగా మూవీ మేకర్స్ డబుల్ అప్డేట్స్ ఇచ్చారు. 'ది రైస్ ఆఫ్ మహాశక్తి' పేరుతో టీజర్ విడుదల చేయడంతో పాటుగా దీపావళి కానుకగా విడుదల కాబోతున్నట్లు ప్రకటించారు.

ఇక విడుదలైన టీజర్ విషయానికొస్తే.. ఇది పాతకాలం నాటి కథ, ప్రస్తుత కాలంలో జరిగే సంఘటనల మధ్య సాగుతుందని తెలుస్తోంది. ఒక రాజ్యం భయంకరమైన దండయాత్రను ఎదుర్కొనే కాలం నేపథ్యంలో వచ్చే సన్నివేశాలు, మనుగడ కోసం చేసే పోరాటాన్ని ఇందులో చూపించారు. ఆ తర్వాత కథ ప్రస్తుతం జరుగుతున్న కాలానికి మారుతుంది. అక్కడ ప్రజల జీవితాలను ఒక పెద్ద ఆపద చుట్టుముడుతుంది. అందరిలో భయం, ఆందోళన నిండిన సమయంలో ప్రజలు దేవుడిని నమ్ముకుంటారు. దాంతో నయనతార ఒక అద్భుతమైన దైవిక రూపంలో మళ్లీ కనిపించి అంచనాలను రెట్టింపు చేశారు. టీజర్ అందరినీ ఆకట్టుకుంటోంది. కాగా.. ఈ చిత్రంలో నయనతారతో పాటు దునియా విజయ్, రెజీనా కసాండ్రా, ఊర్వశి, యోగి బాబు, మైనా నందిని, గరుడ రామ్, అభినయ, సునీల్ వర్మ, నితిన్ సత్య కీలక పాత్రలో నటిస్తున్నారు. ఈ సినిమాకు హిప్-హాప్ తమిళ సంగీతం అందిస్తున్నారు. వినాయక చవితి పండుగ సందర్భంగా 'ది రైస్ ఆఫ్ మహాశక్తి' పేరుతో విడుదల చేసిన టీజర్ సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతోంది.




## 'రామాయణ'లో సీతారాముల దివ్య దర్శనం!

బాలీవుడ్ ప్రముఖ దర్శకుడు నితీష్ తివారీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న భారీ పౌరాణిక చిత్రం 'రామాయణ'. నిర్మాత నమిత్ మల్హోత్రా ఈ విజువల్ వండర్‌ను అత్యున్నత సాంకేతిక విలువలతో నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో రాముడి పాత్రలో బాలీవుడ్ స్టార్ హీరో రణబీర్ కపూర్ నటిస్తుండగా, అందాల నటి సాయి పల్లవి సీతాదేవిగా కనిపించనున్నారు. అలాగే కన్నడ స్టార్ హీరో యష్ రావణాసురుడిగా, కాజల్ అగర్వాల్ మండోదరిగా, రకుల్ ప్రీత్ సింగ్ శూర్పణక పాత్రలో కనిపించబోతున్నారు. ఈ సినిమాపై దేశవ్యాప్తంగా ప్రేక్షకుల్లో విపరీతమైన అంచనాలు ఉన్నాయి. ఈనేపథ్యంలో.. తాజాగా, వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని మూవీ మేకర్స్ ఈ చిత్రం నుంచి అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చారు. సీతారాములుగా రణబీర్, సాయి పల్లవిల ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో సీతారాములు ఏకాంతంగా ఉన్న ఒక దివ్యమైన, అందమైన సందర్భాన్ని చూపించారు.




ప్రస్తుతం ఈ పోస్టర్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతూ ట్రెండింగ్‌లో నిలిచింది.కాగా. ఈ చిత్రానికి సంబంధించిన మరో ప్రధాన ఆకర్షణ సంగీతం. హాలీవుడ్ అగ్రశ్రేణి సంగీత దర్శకుడు హాన్స్ జిమ్మర్ ఈ ప్రాజెక్ట్‌కి మ్యూజిక్ అందిస్తుండటం విశేషం. ఈ భారీ మైథలాజికల్ డ్రామాను రెండు భాగాలుగా విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేశారు. మొదటి భాగాన్ని ఈ ఏడాది దీపావళి కానుకగా నవంబర్ 6న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. ఇక రెండో భాగాన్ని వచ్చే ఏడాది దీపావళికి థియేటర్లలోకి తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు. అత్యున్నత సాంకేతిక హంగులతో రానున్న ఈ సినిమా కోసం సినీ ప్రియులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు.